**"ప్రేక్షకులకి ఇప్పటికీ పౌరాణికాలమీద అభిమానం ఉందండీ. అందువల్ల పౌరాణిక కథని ఎన్నుకుని, సినిమా తీస్తే పిక్చర్ బాగా పోతుందండీ" అన్నాడు టీ షర్టు వేసుకున్న దర్శకుడు, చేతిలో ఉన్న సిగరెట్టును ఓ దమ్ములాగుతూ.**

**"పౌరాణికం తీస్తే మనకొచ్చేది —అర్థంకాదు —మోక్షం. పిక్చర్ దివాళా తీస్తే నేను ఆత్మహత్య చేసుకుని, దేవుడి సినిమా తీసి చచ్చినందుగ్గానూ ఆ పుణ్యఫలంతో స్వర్గానికి పోతాను. నేనింకా ధర్మార్థకామాలు పూర్తిచేసుకోలేదు. అప్పుడే నాకు మోక్షం వద్దయ్యా" —నిర్మాత, తన మెళ్ళో ఉన్న బంగారుగొలుసులోని, వెంకటేశ్వరస్వామి బిళ్ళని కళ్ళకు అద్దుకుంటూ అన్నాడు.**

"స్వర్గానికి పోతారని గ్యారంటీ ఏం లేదండీ, సినిమా చూపించి, ప్రజల్ని యమబాధ పెట్టినందుగ్గానూ నరకానికి పోవలసీ రావచ్చు" అన్నాడు ఓ అసిస్టెంటు.

"అసలు డిస్ట్రిబ్యూటర్ ఎవరైనా ముందుకొస్తే కదా —ప్రజలా సినిమా చూడగలిగేది"

"శుభమా అని సినిమా తియ్యబోదాం అనుకుంటుంటే, అందరూ ఈ అపశకునపు మాటలేంటి ? ప్రేక్షకులు ఎప్పుడూ వెరైటీ కావాలనుకుంటారు. సంథింగ్ డిఫరెంట్ కావాలండీ, అందుకని, కథ పౌరాణికం, భాష పూర్తిగా మనం మాట్లాడుకుంటున్నట్లు పెడితే —వందరోజులు గ్యారంటీగా పోతుందండీ" —దర్శకుడు

"దర్శకుణ్ణి నమ్ముకోక ఏం చేస్తా, ఇంతకీ ఏ కథ తీద్దాం" —నిర్మాత.

"వామనావతారం కథ తీద్దాం. ఆ కథయితే ఖోలెడన్ని ఎఫెక్ట్స్ పెట్టి తియ్యచ్చు. ఎఫెక్టున్నాయి కనుకనే జూరాసిక్ పార్క్ అంత హిట్టయ్యింది"

"కేవలం ఎఫెక్టలతో తెలుగులో సినిమా హిట్టవ్వదండీ. డాన్సలూ, ఫైటింగ్‌లూ ఉండి తీరాల్సిందే" ఎక్కడేది పెడితే బావుంటుందో మీరు చూసుకోండి. అంతే"

"అలాగే కానిద్దాం. మీరు చెప్పేది నేను వినాలి, నేను చెప్పేది మీరు వినాలి. రచయిగారేం మాట్లాడ్డం లేదేంటి" —తెల్ల పైజామా లాల్చీ వేసుకొని, భుజానికో సంచీ, ఆ సంచిలో కాయితాలతో కూర్చున్న రచయితవైపుకి తిరిగిన దర్శకుడు.

"నాదేముందండీ. మీరేం కావాలంటే అది రాసిపెట్టడమే కదా —బుర్రా, నోరూ అక్కర్లేదు, చెయ్యి, చెవులూ చాలు నా పనికి" అన్నాడు రచయిత నిర్లిప్తంగా.

"ఇంతకీ హీరోగా ఎవరిని బుక్ చేద్దాం అంటారు" —దర్శకుడు "రవిరాజును పెట్టుకుందాం" నిర్మాత

"ఆయన సాంఘికం తప్ప వెయ్యడండీ"

"అదే వెరైటీ. సోషల్ హీరో మొదటిసారిగా చేస్తున్న పౌరాణికం, అంటే మంచి పబ్లిసిటీ ఉంటుంది. అతగాడి ఫాన్స్ సినిమా ఎలా ఉన్నా ఆడించేస్తారు"

"ఒప్పుకుంటాడంటారా"

"ఆయన పెట్టే షరతులన్నింటికీ మనం ఒప్పేసుకుంటే సరి ...."

* * *

"మీరు చెప్పిన పాయింట్లన్నీ బాగానే ఉన్నాయి. నేను కూడా ఓ వెరైటీ పిక్చర్ చెయ్యాలనుకుంటున్నాను. కానీ, నేనే రోల్ వేసినా ఫైట్స్ ఉండితీరాలి. ఆ విషయం మీకు తెలుసుగా. ఇంతకీ ఈ పిక్చర్‌లో నేను చేసే క్యారెక్టర్ ఏమిటి ? అన్నాడు ఎర్రగళ్ళ బనీను, నల్లపాంటు వేసుకొని, తన ఎ.సి. రూంలో నల్ల కళ్ళజోడుతో కూర్చున్న హీరో.

"వామనుడి కథలో హీరో వామనుడే. ఆ పాత్ర మీది"

"చిన్నప్పుడెప్పుడో వినుంటాను ఈ కథ. మర్చిపోయాను —ఓ మాటు టూకీగా చెప్పండి" —అన్నాడు హీరో నల్లకళ్ళజోడులోంచి సమంగా కనబడక, కళ్ళజోడు తియ్యడం ఇష్టంలేక, మధ్యస్థంగా, కళ్ళకి అడ్డం రాకుండా, జోడుని ముక్కుమీదికి జారుస్తూ.

"ఓపెనింగ్, రాక్షసులు, దేవతల క్షీరసాగర మథనంతో మొదలవుతుందండీ. అక్కడ మంచి ఎఫెక్ట్స్ అవీ పెడతామండీ....

"డెరెక్టర్‌గారూ ముందు మీరు కథ ... చెప్పండి .... అందులో నా రోల్ ఎలా ఉంటుందో, అది నా ఫ్యాన్స్‌కి నచ్చుతుందో లేదో చూసుకున్నాకే నేను ఓ.కె. చేస్తాను" అంటూ డైరెక్టర్ మాటలు మధ్యలో ఆపేశాడు హీరో.

" .... సముద్రంలోంచి అమృతం వస్తుంది ...."

"నా పాత్ర ... ఏంటి ఈ సీన్లో...."

"పాత్రంటే .... విష్ణుమూర్తి ... కూర్మావతారం ... అంటే తాబేలు రూపంలో తన వీపు మీద కొండని మోస్తూ క్షీరసాగర మథనానికి తోడపడతాడు"

"తాబేలు కూడా విష్ణుమూర్తే అంటున్నారు కదా, తాబేలు తల బదులుగా నా తల ఉండేలా పెట్టండి. నా ఫాన్స్‌కి బాగా నచ్చుతుంది"

"సముద్రంలో నుండి అమృతం వస్తుంది. అమృతం కోసం దేవతలు, రాక్షసులు మా కంటే మాకని దెబ్బలాడుకొంటుంటారు. అప్పుడు ... జగన్మోహిని వచ్చి ...."

"నా పాత్ర ...." అన్నాడు మళ్ళీ హీరో.

"జగన్మోహినీ వేషంలో విష్ణువే వస్తాడండీ ..."

"అయితే ఆ ఆడవేషం నేనే వేస్తాను...." అని హీరో అంటూంటే. తాబేలు తల తీసి హీరో తల పెట్టాలి అని నోట్‌బుక్‌లో రాసుకుంటున్న అసిస్టెంట్ పని ఆపేసి, నోరుతెరచుకొని ఉండిపోయాడు.

"సార్ జగన్మోహిని అంటే, ఎంతో అందమైన అమ్మాయి అని అర్థం..."

"నా అందానికేం తక్కువయ్యింది...." కోపంగా అన్నాడు హీరో.

"అబ్బెబ్బే, అలాక్కాదు ... నా మాట వినండి... "

"చూడండి డైరెక్టర్‌గారూ, నేను ఎవరిమాటా వినే పొజిషన్‌లో లేను. నా పేరుంటే చాలు సినిమా హిట్. అలాంటిది నేను వినడం ఏంటండీ ... నేను చెప్పేది మీరు వినగలిగితేనే నేనీ పిక్చర్‌కి సైన్ చేస్తాను"

"డైరెక్టర్‌గారూ, మన వెరైటీ పిక్చర్‌లో రవిరాజు హీరో అన్నది నిర్ణయం అయిపోయిది. అందులో మార్పు ఉండదు. ఇంక ఆయనకి వీలుగా కథా కమామీషు అన్నీ మార్చుకోవాల్సొస్తే మార్చుకోండి. సినిమా హిట్టవ్వాలి. రవిరాజు ఉంటే హిట్ అవుతుంది. ఆయనేం చెప్తే అది నోట్ చేసుకోవయ్యా, అసిస్టెంటు" అన్నాడు నిర్మాత, క్లబ్ డాన్సర్‌కి ఖర్చు తప్పింది అని తనలో తాను సంతోషిస్తూ.

"జగన్మోహినిగా మంచి స్టెప్స్‌తో అదరగొట్టేస్తాను డాన్స్‌చేసి..."

కడుపులో వికారంగా ఉన్నా, "ఆహా, ఓహో" అంటూ నోట్ చేసుకోవడంలో నిమగ్నమయిపోయాడు అసిస్టెంటు.

"జగన్మోహిని అమృతం దేవతలకి మాత్రమే ఇస్తుంది. అమృతంతో బలం వచ్చిన దేవతలు రాక్షసుల్ని చితక్కొట్టేస్తారు..."

"నా పాత్ర...."

"ఇక్కడ విష్ణుమూర్తి యుద్ధం చెయ్యడండీ..."

"కుదరదండీ, యుద్ధం సీన్, మధ్యమధ్యలో కొందరు దేవతలు మాయమై విష్ణువొచ్చినట్లు పెట్టండి. ఈ మధ్యనే నేను కొన్ని కొత్త ఫైట్స్ ప్రాక్టీస్ చేశాను..."

"రాక్షసులూ, దేవతలూ బాణాలతో యుద్ధం చేస్తారండీ ..."

"వెరైటీ అండీ. కొత్తరకంగా ఉంటుంది. ఫైట్స్ పెట్టండి..." అన్నాడు దర్పంగా హీరో.

"నోటెడ్" అన్నాడు అసిస్టెంట్, ఎలాగూ తప్పదు కనుక.

దర్శకుడి అభిప్రాయం అనవసరం అని ముందే నిర్మాత చెప్పేశాడు కనుక నోరు మూసుకున్నాడు. నోరు మూసుకుంటే, కథెలా చెప్పడం, అందుకని మళ్ళీ నోరు తెరిచి —"ఇప్పుడు కథ




# బలి

డా॥ గాయత్రీ దేవి

బలిచక్రవర్తి రాజ్యంలో ... బలిచక్రవర్తి చాలా పవర్‌ఫుల్ రాక్షసుడు. దేవత్ని ఓడించి, అమరావతిని స్వంతం చేసుకొని ఇంద్రుణ్ణి తరిమేస్తాడు. రాక్షసులు హాయిగా ఉంటారు. దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థిస్తారు. అప్పుడు విష్ణువు, తను అదితికి కొడుకుగా పుట్టి, దేవతలకి అమరావతి ఇప్పిస్తానంటాడు..."

"నా పాత్ర ...."

"విష్ణుమూర్తి అన్నాడు కదండీ ఇప్పుడు చెప్పిన సీన్లో...."

"ఏం పాత్రండీ, పాముమీద పడుక్కుని చెయ్యెత్తడమా ... నేనలా కదలకుండా ఒకచోటే ఉన్నట్లు వేస్తే బావుండదండీ... మీరు

కానివ్వండి కథ ... నేను మొత్తం ఎక్కడెక్కడ ఏం మార్పులు చెయ్యాలో చేస్తాను అలా చేసెయ్యండి ... తరవాత ?"

".... బలి చాలా దానధర్మాలు చేసి మంచికీర్తి సంపాదిస్తాడు. ఈలోగా వామనుడు పుడతాడు. బలిదగ్గర దానం పుచ్చుకోవడానికి వెళ్తాడు వామనుడు ...."

"ఒక్క నిమిషం ఆగండి డైరెక్టర్‌గారూ... నేను దానం ఇచ్చే రోల్ వేస్తాను నేను దానం పుచ్చుకుంటే, నా ఫ్యాన్స్ ఇష్టపడరు"

"వామనుడు దైవంసార్, ప్రేక్షకులు దేవుడి రోల్‌నే ఇష్టపడతారు. కాక నెక్స్ట్ సీన్‌లో వామనుడు ఇంత ఉన్నవాడు, స్క్రీన్ మొత్తం నిండిపోతాడు. ఇంక ఎవ్వరూ కనబడరు. బలివామనుడి కాలి దగ్గర దోమంత కూడా ఉండడు"

"అలాగే, అయితే సరే....' అని తలూపాడు హీరో.

"సార్... వామనావతారంలో పోతనగారి పద్యాలుంటేనే బావుంటుంది. బలిని ఆశీర్వదిస్తున్నప్పుడు .. 'స్వస్తి జగత్రయీ భువన శాసనసకర్తకు' పద్యం, వామనుడు భూమిని ఒక్క పాదంతో, కొలిచేటప్పుడు 'ఇంతింతై వటుడింతయై' "రవి బింబంబు...." పద్యాలు వాడండి ... అన్నాడు రచయిత వినయంగా, మనసుని చంపేసుకొని చాలా కాలమే అయినా, భగవత కథ అంటే పోతనగారిని మరచిపోలేని తెలుగువాడిగా.

"ఆ పద్యాలకి లిప్‌మూవ్‌మెంట్ కష్టమండీ, కాక, నా ఫాన్స్ పాతకాలంలాగా అనిపించే పద్యాలంటే ఇష్టపడరు. కావలిస్తే అక్కడో మాంఛి ... డైలాగు పెట్టండి.

"మనం కథ మధ్యలోంచి దాటేశాం. వామనుడు రాగానే బలి వామనుడి కాళ్ళు కడుగుతాడు, ఆ తరవాత బలిని పొగుడుతాడు..." అని దర్శకుడు చెబుతూంటే, మొదటి వాక్యానికీ, దరహాసంతో ఉన్నహీరో మొహం రెండో ముక్క వినేసరికి ముడుచుకుపోయింది.

"ఇంతకాలంగా సినిమాలు తీస్తున్నారు కదా, ఎక్కడైనా హీరో విలన్‌ని పొగడ్డం చూశారా డైరెక్టర్‌గారూ... ఇక్కడి కథ మార్చెయ్యండి.. విలన్ పొగడ్డం, విలన్ దగ్గర దానం పుచ్చుకోవడం ఏమిటండీ ... ఇదంతా ...."

"హీరోగారూ బలి విలన్ కాదండీ, బలికి అన్నీ మంచి లక్షణాలే ఉన్నాయి... కాకపోతే దేవతల్ని ఓడించి ఇంద్ర పదవి చేజిక్కించుకున్నాడని దేవతలు విష్ణుమూర్తిని సహాయం అడగడం వల్ల అయన వామనావతారంలో బలిని అణగ ద్రొక్కడానికి వచ్చాడు అంతే" అన్నాడు రచయిత ఆవేశాన్ని ఆపుకోలేక.

"ఈ సంగతి నాకు ముందే చెప్పొచ్చు కదా" అన్నాడు హీరో. తన కళ్ళని కళ్ళ జోడు వెనక్కి వెళ్ళనీయకుండా సూటిగా దర్శకుడివైపు, తరవాత నిర్మాత వైపుకి చూస్తూ.

"అదీ... అదీ..." అంటూ నీళ్ళు నములుస్తూ దర్శకుని వైపు చూశాడు నిర్మాత. దర్శకుడు తీక్ష్ణంగా రచయితని చూశాడు. రచయిత నేలని చూశాడు— "పొట్ట కూటి కోసం అక్షరం ముక్క రాని వాడి ఆజ్ఞానుసారం ఏది రాయమంటే అది రాశానిన్నాళ్ళూ. ఈ పోతన భాగవతాన్ని చంపేస్తుంటే అపుకోలేకపోయానెందుకో. ఇక పస్తులు తప్పవు" అని తనలో తానే అనుకుంటూ.

"ఇందులో బలి విలన్ కాకపోతే..." అని హీరో అంటుంటేకథ అడ్డం తిరుగుతోందని నిర్మాత దర్శకుణ్ణి, దర్శకుడు రచయితని, రచయిత తన తలరాతని తిట్టుకుంటున్నారు ఎవరి మనసుల్లో వాళ్ళు.

"... ఆ వేషం కూడా నేనే వేస్తాను" అని తన మాట పూర్తి చేశాడు హీరో, మిగిలిన ముగ్గురూ హమ్మయ్య అని తృప్తిగా నిట్టూర్చారు. నిర్మాతని తృప్తి పడనియ్యకుండా "నా రెమ్యునరేషన్ డబుల్ చెయ్యండి" అని నిర్మాత బదులు కోసం ఎదురు చూడకుండా "వామనావతారంలో మీరు ముఖ్యమైన సీన్లన్నింటికీ డైలాగులు ఎలా ఉండాలో నా పర్సనల్ సెక్రటరీ చెప్తాడు. అలాగే రాయండి" అని రచయితని తన సెక్రటరీకి వదిలేసి మిగిలిన వాళ్ళనింక బయలుదేరమన్నాడు హీరో.

తెలుగు తప్పుల్లేకుండా రాయడమే కాదు ఒత్తులు తీసేయకుండా మాట్లాడ్డం కూడా చేత కాని హీరో సెక్రటరీ చెప్పినట్లు రాయవలసి రావడం కన్నా ఆత్మహత్యే మేలనిపించింది రచయితకి. అనిపించినా, తన రాతల మీదే ఆధారపడి ఉన్న తన వారి తల రాతలు తలుచుకుని తలవంచేశాడు పరిస్థితులకి, సెక్రటరీకి.

ఆ పూట సెక్రటరీ చెపుతున్న డైలాగులు రాసేసరికి పిచ్చెక్కినట్లయింది రచయితకి. ఆ డైలాగులే చదువుకున్న హీరోకి చెప్పలేనంత ఆనందం కలిగింది.

* * *

షూటింగ్ కొనసాగుతోంది.

రవిరాజు మొహం కనపడని సీన్ లేదు. విష్ణుమూర్తిగానో... తాబేలు తలకాయగానో... మోహినిగానో... దేవదానవ సంగ్రామంలో హఠాత్తుగా శ్రీ విష్ణుమూర్తి వచ్చి మల్లయుద్ధం చేస్తున్నట్లు... బలి చక్రవర్తికి కొత్త కొత్త కుంగ్‌ఫూలూ, ఛింగ్‌లు, ఛాంగ్‌లు అంటూ ఏవో కొత్త కొత్త ఫైట్లు చేస్తున్నట్లుగానో —అలా ఇందుగలడందులేడని సందేహం అక్కర్లేకుండా —అంతటా, అన్నింటా తానే అయిపోయాడు. ఫైట్స్‌లో డ్రమ్ములుండాల్సిందే అంటూ వాటి మీదికి దూకి దొర్లించాడు. కూరల బళ్ళ మీద దూకాడు. పౌరాణికం గెటప్‌తో సోషల్ ఫైట్స్ ఉంటే విజయం తథ్యం అన్నాడు. బలి చేత ఐదు రీళ్ళకి సరిపోయినంతసేపూ దానాలు చేయించాడు దర్శకుడు రవిరాజు కోరిక మీద —ఇక ప్రధానమైన సీన్ వచ్చింది.

తను వామనుడిలా పొట్టిగా కనబడేందుకు వీల్లేదన్నాడు హీరో. అది తన బాడీకి అవమానం కనుక మార్చెయ్యమన్నాడు. వామనుడి నడక సాత్వికంగా ఉండాలన్నాడు దర్శకుడు. వీల్లేదన్నాడు హీరో. దుర్యోధనుడిలా దర్పంగా నేల అదిరేలా అడుగులేస్తూ వచ్చాడు. హీరో కోరిక మేరకు వాయిద్యాలన్నీ మారుమ్రోగేలా బ్యాక్‌గ్యాండ్ మ్యూజిక్ పెట్టారు. డైలాగులు మొదలెట్టాడు హీరో.

"నువ్వేనా బలివి. ఏవో దాన ధర్మాలు చేస్తుంటావుట ! గొప్ప పేరు కొట్టేద్దాం అనేనా ? నీ సంగతేమిటో ఓ చూపు చూద్దాం అనే వచ్చాను" అన్నాడు హీరో వామనుడు.

పోతన భాగవతం ఖూనీ అయిపోతోంది అనుకుంటూ నెత్తి మీద వెంట్రుకలు పీక్కున్నాడు రచయిత.

"నీ పేరేంటి ? ఏ ఊరు మంది ? అది చెప్పు ముందు" —బలి.

"అన్ని పేర్లూ నావేరా —నాకు ఒక్క ఊరేంటి, ఊళ్ళన్నీ నావే. ఎక్కడుంటే అక్కడే ఉంటాను. నన్నెవరు తలుచుకున్నా క్షణంలో ప్రత్యక్షమైపోతాను. మంచి వాళ్ళకి మంచోణ్ణి, చెడ్డ వాళ్ళకి చెడ్డోణ్ణి" అంతకు ముందు రోజు షూటింగులో చెప్పినట్లే అరుస్తూ చెప్పాడు హీరో వామనుడు. 'కట్' అన్న మాట లేకుండా డైలాగులన్నీ ఓ.కే. అయిపోతున్నాయి.

రచయితకి తలబద్దలయిపోతోంది - పక్కనున్న సీసాలోంచిచారెడు కొబ్బరి నూనె నెత్తి మీద పులుముకుని టపటపా మొత్తుకున్నాడు.

"నువ్వొచ్చింది దానానికే కదా - నా దగ్గర ధర్మం పుచ్చుకొందుకొచ్చి గొప్పలు కొట్టకు" - హీరో (బలిగా) -

ఎదురింటి మీనాక్షికి చీర తీసుకెళ్ళాడు చిదంబరం.

"ఏ భావంతో నాకీ చీర ఇస్తున్నారు?" అడిగింది మీనాక్షి.

"మీకు నాపై ఎలాంటి భావం ఉంటే అదే భావంతో నేను చీర ఇస్తున్నాను" అన్నాడు చిదంబరం.

"మీకిలాంటి దురుద్దేశం ఉంటుందని నేనెప్పుడూ అనుకోలేదు" అంది మీనాక్షి.

నందిగాం మురళీమోహన్, నరసన్నపేట



"నా సంగతి తెలియనంతసేపే నీ గొప్ప. నేనడిగింది ఇవ్వగలవా?"

"నా దగ్గర బంగారం, రత్నాలు, వజ్రాలు, ఆవులు, గుర్రాలు, రథాలు, మేడలు, లక్షల ఎకరాల పంట భూములు —ఇలా లెక్కలేనన్ని ఉన్నాయి —వాటిల్లో ఏం కావాలో అడుక్కో. నీకు కాసిన్ని ఇస్తే నాకు పోయేదేంలేదు..." అని గట్టిగా చెప్పి గొంతు తగ్గించి "నిన్ను చూస్తుంటే ఇంకా పెళ్ళయినట్లు లేదు —ఆడ పిల్లలు కావాలంటే చెప్పు. ఎందరు కావాలంటే అందర్ని ఇస్తా" అంటూ నవ్వాడు.

"ఛ ! ఆడ పిల్లంటే నాకు తల్లి, చెల్లీరా... మరోసారి ఇలా మాట్లాడావంటే నేనేం చేస్తానో నాకే తెలియదు. నాకు కావలసింది మూడు అడుగుల నేల ఇవ్వగలవా ?" అని అరిచాడు హీరో.

వికటాట్టహాసం చేశాడు హీరో బలి... ఇంకా నవ్వు ఆపకుండానే —"ఏంటీ ... మూడు అడుగుల ... నేల... నీ కేమయినా పిచ్చా. ఆ కాస్త నేల కోసం నాదాకా రావడం ఎందుకు ? నా ద్వారపాలకుడే ఇచ్చేవాడు కదా. అయినా నీకు అడుక్కోవడం చేతకాకపోతే నాకు తెలివిలేదా —బంగారం, రత్నాలు మూటలు కట్టిస్తా పట్టుకుపో" అన్నాడు.

"వాటి మీద నాకు మోజు లేదు. చేతనయితే నే నడిగిందియ్యి."

"సరే తీసుకో సిరి వస్తానంటే మోకాలు అడ్డం పెట్టేవాణ్ణేం చేస్తాం."

"నేలని నా కాళ్ళతోనే కొలుచుకుంటాను."

బలి చక్రవర్తి గురువు శుక్రాచార్యుడు "బలీ నా మాట విను, వీడు విష్ణుమూర్తి. వేషం మార్చుకుని వచ్చాడు. నువ్వు దానం ఇవ్వకు. నిన్ను చంపేస్తాడు" అన్నాడు.

"నేను రాక్షసుణ్ణే కావచ్చు. కానీ మాటంటే మాటే. శిష్యుల్ని మాట తప్పమని చెప్పవచ్చా గురూ" అన్నాడు హీరో బలి.

"ప్రాణం పోయేలా ఉన్నప్పుడు అబద్ధం చెప్పచ్చు. మంచీ, చెడూ నాకు బాగానే తెలుసు. గొడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్లు —నువ్వు నాకు చెప్పడం ఏమిటి?" అని అరిచాడు గురువు.

"ఒకవేళ వీడు మారు వేషంలో వచ్చిన విష్ణువే అయినా నా కంటే ఎక్కువ శక్తి ఉందా వీడికి. అదీ చూస్తాను."

"ఒప్పుకున్నావా —కొలుచుకోనా?" —వామనుడు.

"కానియ్యి."

డైలాగులు వినిపించడంలేదు రచయిత చెవులకి. పిచ్చి చూపులు చూస్తుండిపోయాడు. హీరోగారి సెక్రటరీ ఓ చెక్కు చేత్తో పట్టుకొచ్చి రచయిత చేతిలో పెట్టి మీ రెవరో రాసిన పద్యాలు మన పిక్చర్లో పెట్టమన్నారట కదా ! ఆయన పేరేదో పోతన్నా ఏదో గుర్తు లేదు —పాపం ఏదో బీద కవి అయ్యుంటాడు. ఓ వంద రూపాయలు ఆయనకిమ్మని మీ కిమ్మని నాకిచ్చారు హీరోగారు. ఆయనది జాలి గుండె గదా" అన్నాడు. రచయితలో చలనం లేదు. సెక్రటరీకి సమయం లేదంటూ వెళ్ళిపోయాడు.

షూటింగ్ ఆగడంలేదు. చివరి సీన్ ఈ రోజు చేసేద్దాం అని పట్టుబట్టాడు హీరో.

కాలు నేల మీద పెట్టాడు హీరో. ఆ పాదం భూమిని, మరో పాదం ఆకాశాన్ని ఆక్రమించినట్లు చూపించడం ఫోటోగ్రఫీ వాళ్ళ పని. వామనుడి పాదాలు అంత పెద్దవిగా భూమి, ఆకాశాలు నిండిపోయినట్లు కనపడడం చూసిన బలి కళ్ళు తిరిగి క్రింద పడ్డాడు.

"బలీ! లే, లే ముందు —నా మూడో అడుగు నీ నెత్తి మీద పెట్టాలి. నువ్వు స్పృహలో లేనప్పుడు నీ తల మీద కాలు పెట్టడం పిరికి వాళ్ళ లక్షణం. లే, త్వరగా నా కాలు నీ తల మీద పెట్టి మూడో అడుగు కొలవనియ్యి. నిన్ను అణిచేస్తాను" అంటూ వామనుడు బలి మీద కాలు పెట్టబోయాడు.

బలి పరుగెత్తడం మొదలెట్టాడు —ప్రాణ భీతితో.

భూమిని ఆక్రమించేంత పెద్ద పాదం కనుక వామనుడు పరుగెత్తకుండా బలి ఎటు పరుగెత్తితో అటు వైపుకి కాలు ఎత్తి తిప్పుతూ తల మీద పెట్టే ప్రయత్నం చేస్తూ గట్టిగా నవ్వసాగాడు.

బలి తల దొరికిపోయింది వామనుడి పాదానికి.

కాలు తల మీద నొక్కిపట్టి "తెలిసిందా నీ సంగతి. ఇంతటితో నీకు ఆయువు మూడింది" అంటూ వామనుడు తన పాదంతో బలి తలని తొక్కెయ్యబోతూంటే —

బలి భార్య వింధ్యావళి, వామనుడి కాలిని పట్టుకుని ఏడుస్తూ —"స్వామీ —నా పసుపు కుంకాలు దూరం చెయ్యకండి. మా ఆయన్ని వదిలెయ్యండి" అంది.

"ఆడవారి కన్నీళ్ళు నేను చూడలేను. నీకు పతి భిక్ష పెడుతున్నాను కాని నువ్వూ, నీ భర్తా అమరావతి వైపుకు రానేకూడదు. ముందు ముందు నీ భర్త నా సంగతి మరిచిపోకూడదు" అన్నాడు.

వామనుడి కాలిక్రింద ఉన్న బలి, బలి ప్రక్కనే ఉన్న వింధ్యావళి తలూపారు.

షూటింగ్ చూస్తున్న రచయిత, ఇక పీక్కోవడానికి జుట్టు మిగలని రచయిత, ఓ వెర్రి కేక వేసి క్రిందపడిపోయాడు.

★ ★ ★

సినిమా రిలీజయ్యింది —సినిమా పేరు "బలి".

మొదటి రోజు సినిమా హాలుకి వచ్చిన రవిరాజు ఫాన్స్‌తో సహా ప్రేక్షకులంతా గబగబా గేట్లు దూకి బయటికెళ్ళారు. ఫ్లాట్లు కట్టడానికి రోడ్డు మీద గుట్టలుగా పోసి ఉన్న కంకర్రాళ్లూ, ఇటుకలు మోసుకొచ్చి కసితీరా స్క్రీన్ మీద విసిరి, తెర చింపి పారేశారు. ఆడ వాళ్ళంతా దోక్కున్నారు. హాలంతా అసహ్యంగా తయారు చేశారు. పోలీసులు రంగంలోకి దిగారు. పోలీసులు ఎందుకు గొడవ చేశారంటే ప్రేక్షకులంతా ఆత్మ సంరక్షణార్థం అన్నారు. కావలిస్తే మీరు కూడా సినిమా చూడండి. మీరు రాళ్ళేసే పరిస్థితి రాకపోతే మమ్మల్ని జైల్లో తొయ్యండన్నారు. బెదిరి పోయారు పోలీసులు.


బలి సినిమా —తీసిన నిర్మాత బలి కాలేదు —సినిమాని ముందే అమ్మేసి సొమ్ము చేసేసుకున్నాడు.

ఒకే కథ ఉన్నా పాత సినిమాని కొత్త సినిమాతోపాటుగా రిలీజు చేస్తే పోల్చి చూడ్డానికి ప్రేక్షకులు బాగా వస్తారనుకుని పాత సినిమా కూడా రిలీజు చేసుకున్నారు. 'బలి' ని కొన్న వాళ్ళు, కొత్త సినిమా చూసి తెరలు చింపిన ప్రేక్షకులు పాత సినిమాని పదే పదే చూశారు —అందువల్ల బలిని కొన్న వాళ్ళు బలికాలేదు. పైగా హాలు ముందు వామనుడి గుడి కట్టి 'పై' ఆదాయం కూడా సంపాదించుకున్నారు.

సినిమా ప్రేక్షకులూ ఎలాగూ బలికాలేదు.

సినిమా ఫ్లాపు అని తెలియగానే తక్కువ ధరకి బేరం చేసుకుని "బలి" ని కొనేశారు. సరికొత్త సినిమాని కోట్లాది ప్రజల కోసం అందిస్తున్నాం అన్నారు 'దూరదర్శన్' వారు చిరు నవ్వులు చిందిస్తూ —

పది రూపాయలు టిక్కెట్టు కొని 'బలి' కి బలి కాకుండా తప్పించుకున్నా పది వేలో, పదిహేను వేలో పెట్టి మరీ కొనుక్కున్న దూరదర్శన్ ప్రేక్షకులు మాత్రం "బలి" కి బలి అయిపోయారు.



తండ్రి : పరీక్షలు బాగా రాశానని చెప్పావు కదరా!
కొడుకు : షార్ట్‌హ్యాండ్ అయితే టీచర్‌కు తేలికని అన్ని పేపర్లు షార్ట్‌హ్యాండ్‌లోనే రాశాను. ఆ తర్వాత తెలిసింది. పేపర్లు దిద్దేవాళ్లకు షార్ట్‌హ్యాండ్ రాదని.

సురేష్‌కుమార్, హైదరాబాద్